సాక్షి
వికారాబాద్

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



జాగ్రత్తలు పాటిస్తేనే దిగుబడి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటకు పురుగు ఆశించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 8లో▸



నంబర్ ప్లేట్స్ తప్పనిసరి

వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా నడిపితే కఠిన చర్యలు తప్పవని పరిగి సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. 8లో▸



ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో?

రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలపడంతో ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. 9లో▸

సాయుధ పోరుకు | వీరతిలకం

బాంచన్ దొర అన్నచేతులతో బంధూకులు పట్టించిన చరిత్ర

- నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం
- అరాచకాలను పశ్నించిన దొండేరావ్ జాదవ్‌కు జైలు

వికారాబాద్: నిజాం నిరంకుశ పాలననుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించాలని డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధిస్తే.. 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజుగా భావిస్తారు. తెలంగాణ విముక్తి కోసం రజాకార్ల చేతిలో ఎంతో మంది అమరులైన విషయం మనకు విదితమే. సెప్టెంబర్ 17ను కొన్ని పార్టీలు విమోచనమని.. మరికొన్ని విలీనంగా అభివర్ణిస్తున్నారు. ఇంకొందరు విముక్తి దినోత్సం చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం విలీన దినోత్సవం చేపట్టగా.. ప్రస్తుత ప్రభుత్వం అన్నీ పక్కకు నెట్టి ప్రజాపాలన పేరిట ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.



మూడు రాష్ట్రాల్లో వేడుకలు


తెలంగాణ ప్రాంతం 1948లో సైనిక చర్య ద్వారా భారత దేశంలో విలీనం కాగా.. 1952లో భారత ప్రభుత్వం మొదటిసారి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించింది. 1948 నుంచి 1956 వరకు ఈ ప్రాంత ప్రజలు సెప్టెంబర్ 17ను విమోచన దినంగా వేడుకలు జరుపుకొన్నారు. తెలంగాణకు చెందిన పది జిల్లాలతో పాటు వికారాబాద్ సరిహద్దుగా ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గ, రాయచూర్, బీదర్, మహారాష్ట్రాకు చెందిన నాందేడ్‌లోనూ ఈ విమోచన వేడుకలు జరుపుకున్నారు.

విముక్తి ఉద్యమంలో అమరులైన ముస్లింలు

సెప్టెంబరు 17ను మతంతో ముడిపెడుతున్నారని కొన్ని పార్టీలు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నాయి. నిజాం నవాబుల రాచరిక నిరంకుశ పాలన, రజాకార్ల పీడ విరగడైన రోజుగా తెలంగాణ విమోచన దినాన్ని వ్యవహరిస్తారు. నిజాం పాలన అంతం కోసం అక్షరాయుధాలు చేతబట్టి రజాకార్ల చేతిలో షోయబుల్లాఖాన్, షేక్ బందగీ, మగ్దూం మొహియుద్దీన్ తదితర ముస్లింలు సైతం అమరులయ్యారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భాగం రజాకార్ల నుంచి విముక్తి చేసేందుకు రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఎంతోమంది ప్రాణాలర్పించారు. హైదరాబాద్ సంస్థానంలోని మరఠ్వాడా, హైదరాబాద్ కర్ణాటక ప్రాంతాల్లోని రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా విలీన ఉత్సవాలు జరుగుతున్నాయి.. ప్రధాన భూభాగమైన తెలంగాణలోనూ అధికారికంగా నిర్వహించాలనేది పలు పార్టీల వాదన.

దొండేరావ్ జాదవ్‌కు తామ్రపత్రం

నిజాం నిరంకుశ పాలననుంచి విముక్తం చేయడానికి కృషిచేసిన మహనీయుల్లో వికారాబాద్ ప్రాంతానికి చెందిన నారాయణస్వామి లాంటి వారు ఎందరో ప్రాణాలను పనంగా పెట్టారు. వికారాబాద్ పట్టణం గాంధీ కాలనీకి చెందిన దివంగత దొండేరావ్ జాదవ్ స్వాతంత్రోద్యమ సమయంలో రజాకార్లకు వ్యతిరేకంగా గొంతు విప్పారు. నిజాం నిరంకుశ పాలన, అరాచకాలను ప్రజలకు వివరించారు. దీంతో నాటి నిజాం ప్రభుత్వం 1947 సెప్టెంబర్ 17న ఆయన్ను అరెస్టు చేసి గుల్బర్గా జైలులో ఉంచారు. 1947 ఆగస్టు 15న దేశమంతటికీ స్వాతంత్ర్యం వచ్చినా నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణాకు మాత్రం స్వాతంత్ర్యం సిద్ధించలేదు. అనంతరం 1948 సెప్టెంబర్ 17న కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ సైనిక చర్యతో హైదరాబాద్ నిజాం సంస్థానం తెలంగాణాలో విలీనమైంది. దీంతో గుల్బర్గా జైలు నుంచి దొండేరావ్ జాదవ్ అదే రోజు విడుదల అయ్యారు.



దొండేరావ్ జాదవ్ సేవలకు గుర్తుగా తామ్రపత్రం పేరిట వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన శిలాఫలకం



నెహ్రూతో దొండేరావ్ జాదవ్ (ఫైల్)

ఆయనకు నాటి ప్రభుత్వం తామ్రపత్రం అందించి సత్కరించింది. అనంతరం విలీనోద్యమ గుర్తుగా వికారాబాద్‌లో ఆయన పేరిట శిలాఫలకం ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ శశాంక పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయం చేసుకుంటూ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

నీటిపారుదల నిర్వహణకు నిధులు ఇవ్వండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో నీటిపారుదలకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 9 చెక్ డ్యాంల నిర్మాణంకోసం రూ.20.68 కోట్లు, చెరువు వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు రూ.27.30 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు త్వరగా మంజూరు చేస్తే నీటిపారుదల వనరులను కాపాడుంటామని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



సమావేశంలో మాట్లాడుతున్న పర్వతాలు

షాద్‌నగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసి, గడీల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విలీన దినోత్సవం అని ఒక పార్టీ, విద్రోహ దినోత్సవం అని మరోపార్టీ మాట్లాడుతున్నాయని ఈ పార్టీలన్నీ ఆనాడు ఎక్కడపోయాయని ప్రశ్నించారు. సాయుధ పోరాటంలో పాల్గొనని నాయకులు ప్రస్తుతం ప్రగల్బాలు పలుకుతున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు శ్రీను, షకీల్, గడ్డం జంగయ్య, చంద్రబాబు, పవన్, శివ, విజయ్, ఆకాష్, సాయి, అజ్మత్ అలీ, ఎల్లయ్య, మైసయ్య పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే గిరిజనాభివృద్ధి

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్



నూతన కమిటీ నియామక పత్రాలు అందుకున్న వారితో రాష్ట్ర నాయకులు

కేశంపేట: ఐకమత్యంతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యం అవుతుందని సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత్లావత్ రవినాయక్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనులను ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గా కాకుండా ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి రేఖ్యా నాయక్, సాంస్కృతిక సేన అధ్యక్షుడు భీమ్లా నాయక్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా సేన అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి గణనాథులు..

‘లక్ష’ణంగా లడ్డూలు

నవరాత్రులు పూజలందుకున్న గణపతి లడ్డూలకు రూ.లక్షల్లో ధర పలికింది. జిల్లాలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన గణనాథులను సోమవారం భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. బొజ్జగణపయ్య ప్రసాదాన్ని దక్కించుకుంటే అంతా శుభం కలుగుతుందన్న నమ్మకంతో భక్తులు పోటాపోటీగా వేలం పాటల్లో పాల్గొన్నారు. రూ.లక్షల్లో అయినా తగ్గేదేలే అంటూ వాటిని కైవసం చేసుకున్నారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రలు అంగరంగవైభవంగా కొనసాగాయి.



కడ్తాల్: మైసిగండిలో వినాయక శోభాయాత్రలో భక్తుల సందడి

- **తుక్కుగూడ:** బొడ్రాయి గణపతి వద్ద లడ్డూను రూ.7.51 లక్షలకు కొమ్మిరెడ్డి అంజిరెడ్డి దక్కించుకున్నారు. తుక్కుగూడ లక్ష్మీనగర్ యూత్ వద్ద మద్దుల చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు రూ.1.30 లక్షలకు కైవసం చేసుకున్నారు.
- **కడ్తాల్:** మైసిగండి పెద్ద వినాయకుడి లడ్డూను జాటవత్ రమేశ్‌నాయక్ రూ.3.50లక్షలకు, గండి మైసమ్మ యూత్ లడ్డూను రూ.1.20 లక్షలకు రామవత్ కల్యాణ్ కైవసం చేసుకున్నారు. హనుమాన్ యూత్ లడ్డూను రూ.1.11 లక్షలకు రాజారాంనాయక్, చిన్న లడ్డూ రూ.1.01 లక్షలకు పాండు సొంతం చేసుకున్నారు. ముత్యాలమ్మ గుడి వద్ద రూ.1.21 లక్షలకు, దేపావత్ ఆలయం వద్ద రూ.1.20 లక్షలకు కృష్ణనాయక్, విస్లావత్ వినాయకుడి లడ్డూను 1.10 లక్షలకు నరేశ్, సభవట్ గణపతి లడ్డూను రూ.లక్షకు కొర్ర శ్రీను దక్కించుకున్నారు. కేతావత్ చిన్న వినాయకుడి వద్ద రూ.2.50 లక్షలకు కేతావత్ ప్రశాంత్, ప్యారడైజ్ మండపం వద్ద రూ.1.32 లక్షలకు ప్రేమ జవహర్‌లాల్ సొంతం చేసుకున్నారు.
- **మొయినాబాద్:** మండల పరిధిలోని సురంగల్‌లో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను రూ.1.50 లక్షలకు కందికొండ మల్లేశ్‌గౌడ్ దక్కించుకున్నారు.
- **తుర్కయంజాల్:** పురపాలక సంఘం పరిధిలోని పాటిగూడలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి లడ్డూను రూ.3.61 లక్షలకు బద్దం శేఖర్ రెడ్డి దక్కించుకున్నారు.
- **షాద్‌నగర్‌రూరల్:** షాద్‌నగర్ పట్టణంలోని శంకర్‌నగర్ కాలనీలో రూ.1,45,116కు మంచన్‌పల్లి రమేష్‌గౌడ్ లడ్డూను కైవసం చేసుకున్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.1,11,116కు సాయిప్రసాద్‌రెడ్డి, బృందావన్‌కాలనీలో రూ.1.9 లక్షలకు పులిమామిడి రాజేష్‌గౌడ్ సొంతం చేసుకున్నారు. ఆనంద్‌నగర్‌కాలనీలో రూ.3 లక్షలకు పెద్ద లడ్డు, రూ.2.35 లక్షలకు చిన్న లడ్డూను మనోజ్‌కుమార్, కీర్తన దంపతులు దక్కించుకున్నారు.
- **అబ్దుల్లాపూర్‌మెట్:** మైత్రీకుటీర్ కాలనీ వినాయక లడ్డూను రూ.1.70 లక్షలకు కాలనీ అధ్యక్షుడు మేకా మహేందర్‌రెడ్డి కైవసం చేసుకున్నారు.
- **ఇబ్రహీంపట్నం:** కర్ణంగూడలో శ్రీ ఆంజనేయ భజన మండలి ప్రతిష్ఠించిన మండపం వద్ద వినాయకుని లడ్డూ రూ.1.01 లక్షలకు యంపల్ల వినయ్‌రెడ్డి దక్కించుకున్నారు.



తుక్కుగూడ: అంజిరెడ్డికి లడ్డూను అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



విద్యుత్ కాంతులతో కలెక్టరేట్

నేడు ‘ప్రజా పాలన’ వేడుకలు

- ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పతాక ఆవిష్కరణ చేయనున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్: గత ప్రభుత్వం సెప్టెంబర్ 17న విలీన దినోత్సవం పేరిట నిర్వహించిన వేడుకలను ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో చేపడుతోంది. రెండు రోజులుగా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఇందుకు సంబధించిన ఏర్పాట్లను సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి అధికారులకు కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. మంగళవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

లోటుపాట్లు ఉండొద్దు

నేడు నిర్వహించే ప్రజాపాలన వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమీక్షించారు. పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి సంబంధిత అధికారులతో ఏర్పాట్ల విషయాలను తెలుసుకున్నారు. వేడుకల్లో లోటుపాట్లు ఉండొద్దని సూచించారు. వీఐపీ గ్యాలరీ, మైక్, గ్రౌండ్ సుందరీకరణ పనులు పరిశీలించారు. అనంతరం పోలీసుల పరేడ్ రిహార్సల్స్‌ను పర్యవేక్షించారు.

కార్యక్రమ షెడ్యూల్

సమయం	వివరాలు
9.30 గంటలకు	సందర్శకులు వస్తారు
9.55 గంటలకు	ఎస్పీ, కలెక్టర్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు
9.58 గంటలకు	శాసన సభ స్పీకర్ వస్తారు
10.00 గంటలకు	జాతీయ పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం
10.05 గంటలకు	స్పీకర్ ప్రసంగం
11.00 గంటల వరకు	సాంస్కృతిక ప్రదర్శనలు
11.00 గంటలకు	వందన సమర్పణ

ఓఆర్ఆర్ పైనుంచి కింద పడిన లారీ

డ్రైవర్ మృతి

- క్లీనర్‌కు తీవ్ర గాయాలు
- నిద్ర మత్తే ప్రమాదానికి కారణం

అబ్దుల్లాపూర్‌మెట్: ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్న లారీ అదుపు తప్పి.. సర్వీస్ రోడ్డుపై పడిన ఘటనలో డ్రైవర్ మృతిచెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని సత్యసాయి జిల్లా హిందూపూర్ మోడల్ కాలనీకి చెందిన రాజగోపాల్‌చారి (28) తన లారీలో ఐరన్ లోడ్ తీసుకుని రాయ్‌పూర్ నుంచి బెంగళూర్ వెళ్తున్నాడు. ఘట్‌కేసర్ వద్ద ఓఆర్ఆర్ ఎక్కి తారామతిపేట టోల్‌గేట్ దాటాడు. 500 మీటర్ల దూరం వెళ్లగానే అదుపు తప్పిన లారీ ఔటర్‌పై నుంచి అంబర్‌పేట్ వెళ్లే సర్వీస్ రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ రాజగోపాల్‌చారి కేబిన్‌లో ఇరుక్కుని మృతిచెందగా గ్యాస్ కట్టర్ల సాయంతో బయటకు తీశారు. క్లీనర్ బాబాజాన్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఔటర్‌పై నుంచి బోల్తాపడిన లారీ

ప్రత్యేక వైద్య శిబిరాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జనం జరుగుతున్న సందర్భంగా ఆయా ప్రాంతాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్యాన్ని అందించేందుకు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, అంబులెన్సులను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ నగరంలో గణేష్ నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాలలో ముందస్తుగా 30 చోట్ల హెల్త్ క్యాంప్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ట్యాంక్ బండ్‌కు లక్షలాదిగా తరలివస్తున్న గణేష్ భక్తులు, పర్యాటకులకు అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ చిత్రంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రూ.వంద కోట్ల నిధులు ఇవ్వండి

ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.వంద కోట్ల నిధులు అవసరం అవుతాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పారు. సోమవారం ఆయన నూతన డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్‌తో కలిసి సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలోని చెరువులు, వాగుల ఆక్రమణలపై రేవంత్‌రెడ్డికి వివరించారు. గతవారం చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో పట్టణంలోని ప్రధాన సమస్యలను గుర్తించామన్నారు. చిలుక వాగు ప్రక్షాళనతో పాటు గొల్ల చెరువు అలుగు చిలుకవాగుకు అనుసంధానం చేస్తే పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి త్వరలోనే నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే బీఎంఆర్‌కు హామీ ఇచ్చారు. అనంతరం డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ ముఖ్యమంత్రిని సన్మానించారు. వీరి వెంట యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పలువురు నాయకులున్నారు.

క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పూడూరు: మండల పరిధిలోని బాకాపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంగళవారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి విచ్చేయనున్నట్లు ఎంపీడీఓ పాండు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి అధికారులు, నాయకులు సకాలంలో హాజరవ్వాలన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని చెప్పారు.

ముగ్గురికి రిమాండ్

యాలాల: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కేసులో యాలాల పోలీసులు సోమవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శంకర్ ప్రకారం.. మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన చిట్టిబాబు ఈ నెల 5న పురుగు మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. చిట్టిబాబు ఆత్మహత్యకు భార్య పద్మ, అత్తామామలు లక్ష్మమ్మ, భీంశప్పలు కారణమంటూ మృతుడి తల్లి హన్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

సెల్‌టవర్ వద్ద బ్యాటరీలు చోరీ



ఖాళీగా కనిపిస్తున్న బ్యాటరీ ర్యాక్

ధారూరు: సెల్‌టవర్ స్టోర్ రూంలో ఏర్పాటు చేసిన 24 బ్యాటరీలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం ధారూరు–తాండూరు ప్రధాన రోడ్డు పక్కన టీవరల్డ్ ఎదుట ఏటీసీ సెల్‌టవర్ వద్ద బ్యాటరీ బ్యాంక్ రూం ఏర్పాటు చేశారు. ఇందులో విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇన్‌వర్టర్‌గా 24 బ్యాటరీలు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని దొంగలు ఈ నెల 14న రాత్రి రూ.60వేల విలువైన 24 బ్యాటరీలు ఎత్తుకెళ్లారని టవర్ టెక్నీషియన్ కె.అనిల్‌కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కోరిక తీర్చలేదని కొట్టిచంపాడు

- మహిళ అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడు బాబురావుకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్

కొత్తూరు: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి కేసును కొత్తూరు పోలీసులు ఛేదించారు. ఏసీపీ శ్రీనివాస్ సోమవారం మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరులో నివాసం ఉంటున్న యాదమ్మ(45) స్థానిక లేబర్ అడ్డా వద్ద కూలీ పని చేస్తుండేది. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన రామారావుతో పరిచయం ఏర్పడి, ఒకే ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. వీరు ప్రకాశం జిల్లాకు చెందిన తాపీ మేస్త్రీ పేరం బాబురావు వద్ద పనికి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో యాదమ్మపై మోహం పెంచుకున్న బాబురావు వారితో సన్నిహితంగా మెలిగేవాడు. అప్పుడప్పుడు రామారావు ఇంటికి వెళ్లి ముగ్గురూ కలిసి మద్యం తాగేవారు. ఇదిలా ఉండగా రామారావు స్వగ్రామానికి వెళ్లాడని తెలుసుకున్న బాబురావు ఈనెల 11న రాత్రి 9గంటలకు కల్లు తీసుకుని యాదమ్మ ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ మద్యం తాగిన అనంతరం మనసులో మాట చెప్పాడు. దీనికి ఆమె అంగీకరించకపోవడంతో కోపోద్రిక్తుడై యాదమ్మపై దాడి చేశాడు. ఈక్రమంలో ఆమె మృతిచెందింది. మరుసటి రోజు విషయం తెలుసుకున్న మృతురాలి కూతురు రేణుక ఇంటికి వచ్చేసరికి తల్లి విగతజీవిగా పడిఉంది. ఈ విషయమై ఆమె ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా బాబురావుపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నిజం ఒప్పుకొన్నాడు. అనంతరం నిందితుడి నుంచి రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనకు కృషి చేసిన సీఐ నర్సింహ్మారావు, ఎస్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌చారి, కానిస్టేబుళ్లను ఏసీపీ ప్రశంసించారు. వీరికి రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

జాగ్రత్తలు పాటిస్తేనే సరైన దిగుబడి

- వర్షాల కారణంగా పత్తి పంటకు పొంచి ఉన్న ప్రమాదం
- కాయ దశలో ప్రత్యేక శ్రద్ధ అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర నష్టం

దుద్యాల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటకు పురుగు ఆశించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం పంట పూత దశ నుంచి కాయదశకు చేరుకుంది. పత్తిని ఆశించే వివిధ రకాల చీడపీడల్లో రసం పీల్చే పురుగులు ప్రధానమైనవి. ప్రస్తుతం వర్షాల కురుస్తున్న సమయం.. వాతావరణ మార్పుల కారణంగా పంట దిగుబడిపై ఇవి ప్రభావం చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో పంటకు తెగుళ్ల బెడద పొంచి ఉందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పురుగుల నుంచి పంటను కాపాడుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే దిగుబడి సగానికిపైగా తగ్గి నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పచ్చ దోమ

సాధారణంగా అధిక వర్షపాతం, తక్కువ ఉష్ణోగ్రతలు, మబ్బులతో కూడిన వాతావరణ పరిస్థితుల్లో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకుల మీద అడ్డంగా నడుస్తూ ఆకుల అడుగు భాగానికి చేరి రసాన్ని పీలుస్తాయి. ఈ పురుగు ఆశించడం వల్ల మొక్క ఆకులు ముడుచుకుని లేత పసుపు రంగు నుంచి నెమ్మదిగా ఎరుపు వర్ణానికి మారి పూర్తిగా రాలిపోతుంది. దీంతో మొక్కల ఎదుగుదల ఆగిపోతుంది.



అలేడ్‌లో ఏపుగా పెరిగిన పత్తి పంటను చూపుతున్న రైతు

పేనుబంక పురుగు

పేనుబంక పురుగు బెట్ట వాతావరణంలో, వానా కాలంలో ఎక్కువగా ఉండే అవకాశాలు ఉంటాయి. వర్షాలకు మధ్య వచ్చే బెట్ట కాలంలో పంటలపై ఎక్కువగా ఆశిస్తుంది. తల్లి, పిల్ల పురుగులు మొక్క లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి రసాన్ని పీల్చుతుంటాయి. దీంతో మొక్క ఎదుగుదల నిలిచిపోతుంది. పేనుబంక పురుగు తేనె వంటి జిగురు పదార్థాన్ని విడుదల చేస్తుంది. దీంతో ఆకులపై నల్లని బూజు ఏర్పడి సూర్యరశ్మి తగలక కిరణజన్య సంయోగక్రియ జరగక మొక్క ఎదుగుదల ఆగిపోతుంది.

తామర, తెల్ల దోమ

సాధారణంగా వర్షాలు తక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న వాతావరణంలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు ఆకు అడుగు భాగాన చేరి ధారాళంగా రసాన్ని పీల్చుతుంటాయి. దీంతో ఆకులు ముడుచుకుని పలుచగా మారుతాయి. పత్తిలో తలమాడు తెగులు తామర పురుగు వల్ల వ్యాప్తి చెందుతుందంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు.



తెగులు సోకి రంగు మారిన పత్తి కాయ



ఆకుల నుంచి రసం పీల్చుతున్న తెల్ల దోమ

ఎర్రనల్లి

ఎర్రనల్లి పురుగు బెట్ట పరిస్థితులు, పిందె, కాయ దశలో పంట ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఉంటుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరిన సాలీడు గూడులాగా అల్లికలు చేసి ఆకుల నుంచి రసాన్ని పీల్చుతుంటాయి. దీంతో ఆకుల మధ్య పసుపు రంగు నుంచి ఎరుపు రంగుకు మారి ఆకులు రాలిపోయి ఎండిపోతుంది.

మందులు పిచికారీ చేసుకోవాలి



వర్షాల కారణంగా పత్తి పంటకు తెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలను పరిశీలించి ఏఈఓల సూచనల ద్వారా చీడపీడ నివారణ మందులను పిచికారీ చేసుకోవాలి. ఇష్టానుసారంగా మందులు వాడితే నష్టం వాటిల్లుతుంది. రైతులు నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలి.

– శంకర్ రాథోడ్, ఏడీఏ, కొడంగల్

పురుగు మందు డబ్బాతో రైతు హల్‌చల్



అంతారం శివారులో సర్వే చేస్తున్న అధికారులు

- తమ భూమిని ఇతరులకు కేటాయించొద్దని నిరసన
- ఎమ్మెల్యే హామీతో శాంతించిన ఆందోళనకారులు

తాండూరు రూరల్: ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని ఇతరులకు కేటాయించడంపై మండలంలోని అంతారం రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. చివరకు ఎమ్మెల్యే హామీతో శాంతించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన డప్పు రాజు, శ్రీను, లక్ష్మి అనే ముగ్గురు రైతులు.. తాతల కాలం నుంచి గ్రామ శివారులోని తొమ్మిది ఎకరాల తాత్కారీ భూమిని సాగు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా యాలాల మండలం బషీర్‌మియాతండా వద్ద మార్కెట్ కమిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం 30 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో తుకారాం, కడవాత్ శివరాం, గోప్యనాయక్, నక్కాల పుల్లప్ప, బొర్రె పెంటప్ప, సంగమ్మ భూమిని కోల్పోయారు. వీరికి అంతారంలోని తొమ్మిది ఎకరాల నుంచి 5.29 ఎకరాల భూమిని కేటాయించారు. సర్వేయర్ మహేశ్, ఆర్‌ఐ గోపి ఆధ్వర్యంలో సర్వే చేసి సోమవారం హద్దులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా తమ భూమిని ఇతరులకు ఎలా కేటాయిస్తారంటూ డప్పు రాజు అనే రైతు ఆందోళన వ్యక్తంచేశాడు. పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు డబ్బాను లాక్కున్నారు. బాధితులకు న్యాయం చేస్తామని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో ఫోన్ మాట్లాడించారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విజయ్ భాస్కర్‌రెడ్డి, జర్నప్ప, అజ్మత్, రాజు తదితరులు ఉన్నారు.



పురుగు మందు డబ్బా పట్టుకున్న రాజును సముదాయిస్తున్న పోలీసు



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: బ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు బ్రాహ్మణ సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గురురాజ్ దీక్షిత్, గురురాజ్ జ్యోషి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమాజం సభ్యులు నగరంలోని ఎమ్మెల్యే బీఎంఆర్ నివాసానికి వెళ్లారు. బ్రాహ్మణ సమాజం కోసం చేసిన సహాయార్థం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాలలో సంప్రదాయంగా నిత్యపూజలు చేస్తున్న బ్రాహ్మణుల సేవ అద్వితీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు రాఘవేందర్‌రావు, ప్రదీప్, ఉమాకాంత్, శశిధర్, రవికుమార్, హరిసర్వోత్తమరావు, నరసింహారావు, భరత్, వికాస్ తదితరులున్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్స్ తప్పనిసరి

పరిగి సీఐ శ్రీనివాస్

పరిగి: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా నడిపితే కఠిన చర్యలు తప్పవని పరిగి సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణ కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిగి: వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ శ్రీనివాస్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

తాండూరు రూరల్: నంబర్‌ప్లేట్ వాహనాలను సీజ్ చేస్తామని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఠాణా ఎదుట వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు ధ్రువ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్‌ఐ పవన్ కుమార్, కానిస్టేబుల్స్ ఉన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులకు చలాన్లు

మోమిన్‌పేట: అనుమానస్పదంగా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన అంబేద్కర్ చౌరస్తాలో ఎస్‌ఐ అరవింద్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్‌ప్లేట్ లేని 31 వాహనాలకు, ధ్రువపత్రాలు లేని 40 వరకు వాహనాలకు చలానా విధించారు.

స్పెషల్ డ్రైవ్‌లో 15 వాహనాలకు జరిమానా

తాండూరు: నంబర్ ప్లేట్ లేని 15 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించామని పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 15 వాహనాలను సీజ్ చేశామన్నారు. తర్వాత వాహనదారులతోనే నెంబర్ ప్లేట్‌లను పెట్టించి జరిమానా విధించామన్నారు.



తాండూరు రూరల్: నంబర్‌ప్లేట్ లేని వాహనాలను పట్టుకున్న పోలీసులు



మోమిన్‌పేట: వాహనాల తనిఖీలో సీఐ నవీన్‌కుమార్

జోనల్ స్థాయి క్రీడాపోటీలకు సెలక్షన్స్

ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ అంబదాస్

తాండూరు: తాండూరు జోనల్ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు ఈనెల 18 నుంచి క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ తాండూరు జోనల్ సెక్రెటరీ జె.అంబదాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను తాండూరు జోనల్ పరిధిలోని యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాలాలకు చెందిన అండర్–14, అండర్–17 విద్యార్థులకు క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ బుధవారం నుంచి ఈ నెల 28వరకు కొనసాగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వయసు ధ్రువీకరణ కోసం పాఠశాల నుంచి బోనోఫైడ్ సర్టిఫికెట్‌ను తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు. అండర్–14 క్రీడల్లో పాల్గొనేందుకు 2011 జనవరి 1, అండర్–17 పోటీల్లో ఆడేందుకు 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారే అర్హులని చెప్పారు. ఈ నెల 18న అండర్–17 విద్యార్థులకు 19న అండర్–14 బాలబాలికలకు పట్టణంలోని క్రికెట్ కోచింగ్ అకాడమీలో క్రికెట్ సెలక్షన్ ఉంటాయన్నారు. బషీరాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో 20,21 తేదీల్లో బాలబాలికలకు ఖోఖో, 23న వాలీబాల్, 24 నుంచి 27 వరకు కబడ్డీ, రన్నింగ్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్‌నకు ఎంపిక ఉంటుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు సెలక్షన్లకు సకాలంలో హాజరవ్వాలన్నారు. వివరాలకు 9618987442 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపికకు..

కుల్కచర్ల: వాలీబాల్ జట్టు కూర్పునకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలో అండర్–14, అండర్–17 విభాగంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి రెండు విభాగాల్లో బాలబాలికల జట్లు పాల్గొంటాయని ఆయన చెప్పారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వీధి కుక్కల విజృంభణ



కొందుర్గులో కుక్కల దాడిలో గాయపడిన గొర్రెలు

- మూగ జీవాలతో పాటు మనుషులపైనా దాడి
- చిన్నారులను బయటకు పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు
- శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతి

కొందుర్గు: గ్రామాల్లో ప్రజలు బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఏ గల్లీల్లో చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. చిన్న పిల్లలనే కాదు పెద్దవారిపై సైతం దాడి చేసి పీక్కు తింటున్నాయి. ఇక చిన్నారులు బయటికి వెళ్తే ప్రాణాలతో ఇంటికి వస్తారా.. లేదా అని భయపడాల్సిన దుస్థితి నెలకొంది. నెలరోజుల క్రితమే జిల్లేడ్ చౌదరిగూడ మండలం బోయ అంజనేయులుకు చెందిన ఆవు, లేగదూడలపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఈ ఘటనలో లేగదూడ మృతిచెందింది. అయితే మరో పది రోజుల అనంతరం కొందుర్గులో వీరవిహారం చేశాయి. తాపీ మేస్త్రీగా పని చేసే కర్నూల్ జిల్లా మంత్రాలయానికి చెందిన గురురాజన్‌తోపాటు అక్కడే ఉన్న మరో ఇద్దరు మహిళలపై దాడిచేసి గాయపరిచాయి. కొందుర్గుకు చెందిన దయ్యాల శ్రీశైలంకు చెందిన మేకలపై దాడి చేసి నాలుగు మేకలు మృతిచెందాయి. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం కొందుర్గు మండలం ముట్పూర్‌కు చెందిన గొల్ల సాయిలు లేగదూడ కుక్కల దాడిలో మృతిచెందింది. ఇక తాజాగా ఆదివారం రాత్రి కొందుర్గుకు చెందిన ఎల్లంపల్లి శ్రీశైలం గొర్రెల మందపై దాడిచేసి 30 గొర్రెలను గాయపరిచాయి. గాయపడిన జీవాలు మృత్యువాతపడటంతో బాధిత రైతు లబోదిబోమని విలపించాడు. రూ.2 లక్షలకు పైగా నష్టపోయాయని వాపోయాడు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి...

ప్రతి గ్రామంలో వీధికుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయని, బయటికు వెళ్లాలంటేనే భయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో చిన్నచిన్న పనులకు సైతం పిల్లలను బయటకు పంపడం లేదని పేర్కొంటున్నారు. పశువులు, లేగదూడలపై దాడిచేసి తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల దాడినుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, అధికారులను కోరుతున్నారు.

లారీ ఢీకొట్టి.. వృద్ధుడు మృతి



లింగయ్య(ఫైల్)

షాబాద్: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం షాబాద్ మండలం నాగర్‌గూడ చౌరస్తాలో చోటుచేసుకుంది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగర్‌గూడకు చెందిన ఎర్రవల్లి లింగయ్య(60) ఉదయం 7:30 గంటలకు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. అతివేగం, డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ఈ దుర్ఘటన జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లింగయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాల్‌నగర్ మండలం మాచారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌ను తాండ్య గోవింద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిని బావమరిది బీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టంచేశారు.

పందిని ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు..



ఘటనా స్థలిలో సునీల్ మృతదేహం

కందుకూరు: బైక్ అదుపు తప్పి, పందిని ఢీకొట్టిన సంఘటనలో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తూర్ మండలం ఖయాజీగూడతండాకు చెందిన విస్లావత్ సునీల్(28) బేగరికంచె వద్ద ఉన్న అమేజాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నిత్యం బైక్‌పై స్వగ్రామానికి వచ్చివెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు విధులు ముగించుకుని, తిరిగి వెళ్తుండగా కందుకూరు చౌరస్తా వద్ద అకస్మాత్తుగా పంది ఎదురైంది. తప్పించే క్రమంలో పందిని ఢీకొట్టగా బైక్ పైనుంచి కిందపడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు, పోలీసులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెట్రోల్ డబ్బాలతో మున్సిపల్ కార్యాలయానికి..

ఆత్మహత్య చేసుకుంటామని పారిశుద్ధ్య కార్మికుల హల్‌చల్

తాండూరు: ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు పెట్రోల్ డబ్బాలతో మున్సిపల్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. ఈ ఘటన సోమవారం తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. తాండూరుకు చెందిన నర్సింలు, జ్యోతి మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను గ్రూప్‌లుగా విభజించి వేతనాలు ఇస్తున్నారు. తొమ్మిది మంది ఉన్న వీరి గ్రూప్‌లో నర్సింలు, జ్యోతికి మినహాయించి మిగిలిన ఏడుగురికి వేతనాలు అందించారు. దీంతో మనస్తాపానికి గురైన ఇద్దరు పెట్రోల్ బాటిళ్లు తీసుకుని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు ఇస్తారా..? చావమంటారా అని నిలదీశారు. కమిషనర్ నచ్చజెప్పేందుకు యత్నించినా వినలేదు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పెట్రోల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వేతనాలు అందకుంటే కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాపాలనలో దరఖాస్తు చేయాలని ఇది సరికాదని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల పెట్రోల్ బాటిల్స్‌తో కార్యాలయానికి రావడం పరిపాటిగా మారిందని.. కార్మికులకు ఇలాంటి సలహాలు ఇచ్చే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

జీఓ రద్దు చేయాలి

- పీహెచ్‌సీ, కళాశాలలు దుద్యాల్‌లోనే ఏర్పాటు చేయాలి
- గ్రామ పంచాయతీ ఎదుట అఖిలపక్ష నాయకుల ధర్నా

దుద్యాల్: ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జూనియర్, ఐటీఐ కళాశాలలను దుద్యాల్‌లోనే ఏర్పాటు చేయాలని గ్రామ అఖిలపక్ష నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. కొడంగల్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలానికి సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, కళాశాలలు హకీంపేటలో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదివారం జీఓ విడుదల చేసింది. ఇందుకు వ్యతిరేకంగా దుద్యాల అఖిలపక్ష పార్టీల నాయకులు గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు గానీ ప్రభుత్వ కళాశాలలు గానీ, ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయం, విద్యుత్ కార్యాలయం ప్రజా పాలన సాగించే అన్ని కార్యాలయాలను మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్ మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు కళాశాలలు మండల కేంద్రాల్లోనే ఉన్నాయని.. ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కళాశాల మరియు ఐటీఐ కళాశాలలను మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో ఏర్పాటు చేస్తూ విడుదల చేసిన జీఓను వెంటనే రద్దు చేసి దుద్యాల్ మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బుస్స చంద్రయ్య, నరేశ్, అహ్మద్, రాములు, రమేశ్, పాషా, నర్సింలు గౌడ్, బసిరెడ్డి, రాజు, అప్సర్, శాంతు, వెంకటయ్య, రవి నాయక్, గోపాల్ నాయక్, శివప్ప, వెంకటయ్య, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్ గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

కత్తితో దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

పహాడీషరీఫ్: సొంత బావపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని పహాడీషరీఫ్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన మహేశ్‌ను అతని బామ్మర్ది ఒరుసు శ్రీను(25) ఆదివారం రాత్రి కత్తితో కడుపులో పొడిచాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు ఆధారంగా ఇతరులను కూడా విచారిస్తున్నామన్నారు.